ఒక్క గంతులో జగన్నాథం ఆమెను చేరి గట్టిగా వాటేసుకుని, "ఫూల్! ఫూల్!" అన్నాడు.

కాస్సేపటికి మాణిక్యం కాఫీకప్పులతో వచ్చేసరికి సులోచనా, జగన్నాథమూ డర్బీ స్వీప్ గెలుచుకున్న వాళ్ళ మొహాలు పెట్టుకుని కూచునివున్నారు...

నువ్వులూ - తెలకపిండి

తెలకపిండి యెట్లావస్తుందో అందరికీ తెలుసు. నువ్వులు ఆట్టే నాగరికతలేని సరుకు. అది పొలాల్లో కష్టజీవుల చేతుల్లో పెరిగి మధ్యవాళ్ళకు అమ్ముడుపోయి బస్తీ చేరుతుంది. అక్కడ దాన్ని గానుగ ఆడి నూనె తీస్తారు. ఆ నూనె అందమైన సీసాలకూ డబ్బాలకూ యెక్కి అనేక వంటిళ్ళను అలంకరిస్తుంది. తెలకపిండి చక్కను నువ్వు లక్షవేళ చూసినా పోల్చుకోలేవు. అది గొడ్లకూ పేదవాళ్ళకూ ఆహారమౌతుంది.

నువ్వులు గానుగాడటం యేమంత గొప్ప విషయం కాదు. నేను మనుష్యుల్ని గానుగాడగా చూశాను. ఎందుచేతనో నాకా పద్ధతి రుచించలేదు.

* * * *

సోమయాజులు నా ఆప్తస్నేహితుడు. వాడిపట్ల నాకున్న భావాన్నిగురించి యే కవులూ, ఏ కథకులూ రాయ

లేరు. అటువంటి భావాలను మాటల్లో వ్యక్తంచెయ్యటానికి ప్రయత్నిస్తే అబద్ధాలనో, అతిశయోక్తులనో అనిపిస్తాయి. నేను వాడికోసం ప్రాణం త్యాగం చేస్తానో లేదో పరీక్షకు రాలేదు. అదృష్టవశాత్తూ అటువంటిపరీక్షేవస్తే యేంచేస్తానో చెప్పలేను. ఇటువంటి ప్రశ్నలకు అంతరాత్మలను సమాధానాలడిగితే అవి చెప్పే కబుర్లు కోటలు దాటుతాయి. సోమయాజులును పులి వెంబడిస్తే వాణ్ణి తప్పించటానికి నేను పులితో కలియబడగలనని నా అంతరాత్మ చెబుతున్నది. కాని పులుల్ని మించిన మనిషి వాడి వెంటపడి కోరలతో పట్టుకుంటే నేను మంత్రానికి కట్టుబడ్డవాడల్లే చూస్తూ నిలబడ్డాను....ఐనా నా అంతరాత్మలో నాకు విశ్వాసం చావలేదు. నిజానికి మనం పులులతోనూ, విషసర్పాలతోనూ యెట్లా వ్యవహరించాలో నిర్ణయించినంత బాగా పులులవంటి, విషసర్పాలవంటి మనుష్యులతో వ్యవహరించటం గురించి నిర్ణయించలేం...

సోమయాజులు పేదకుటుంబానికి చెందినవాడు. నేను చిన్నతనంనుంచీ వాడితో కలిసి చదివినవాణ్ణి కనక నాకు వాళ్ళమ్మా, నాన్నా, వాడి తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ బాగా తెలుసు. వాళ్ళ యింటివాతావరణాన్ని నేను కొంచెమైనా సహించలేకపొయ్యేవాణ్ణి. వాళ్లు దరిద్రంతో బాధపడటం కూడా దరిద్రాన్ని ఆరాధించటం బాగా కనిపించేది. వాళ్ళింటిలో అందరి సంస్కారమూ ఒకే ధోరణిలో వుండేది—ఎట్లా పూచికపుల్ల దగ్గిర్నుంచీ పోగుచేతామా అని! అదియిది దారిద్ర్యంతో సంబంధంలేకుండా వేరే వ్యక్తిత్వం

సంపాదించుకున్నది. ముఖ్యంగా సోమయాజులు తల్లి అడ్డమైన, పనికిమాలిన వస్తువులన్నీ సంపాదించటానికి దొంగతనం మినహాగా మిగిలిన యుక్తులన్నీ చేసేది ఏ ఉదయం వీధిలో చూసినా ఆవిడ పేడకోసం యెవరితోనో ఒకరితో పోట్లాడుతూనే వుండేది. తరువాత ఆవిడదగ్గిర దేవిరింపుకూడా వుండేది. ఆవిడ మా యింటికి వచ్చినప్పుడల్లా "మీాకు అక్కర్లేనిది—ఏదన్నా వుంటే యిస్తురూ" అని పుచ్చుకు పోతూవుండేది. ఆ వస్తువు మా యింటిలో వుండటంచూసే ఆవిడ అడిగేది అది మాకు అక్కర్లేనిదన్నట్లు నటిస్తే మేం మరింత త్వరగా యిస్తామని ఆవిడ విశ్వాసం. మా అమ్మకు ఆవిడ దేవిరింపు బొత్తిగా గిట్టేదికాదు. ఆవిడ అడిగిన వస్తువు నిజంగా అక్కర్లేకపోయినా మా అమ్మ తనకు దానితో పని వున్నట్లు నటించేది. మా అమ్మైనా తక్కువ తిన్నదికాదు. కాని సోమయాజులు తల్లి యింటికి వచ్చినప్పుడల్లా వంటింటిలో డబ్బాలకేసి, కూరగాయలకేసి, పప్పుకేసి ఆశగా చూస్తుంటేనూ, ఏదన్నా మా అమ్మ బాగుచేస్తుంటే చాలు. "అయ్యో, బియ్యం నూక పురుగు పట్టినట్టుందే! గోధుమ రవ్వ ముక్కినట్టుందే!" అంటేనూ భరించటం కొంచెం కష్టంగానే వుండేది.

సోమయాజులుగారింటో అనుక్షణమూ వస్తువులు ఆదా—దమ్మిడీలో నూరోవంతు చెయ్యని వస్తువులపొదుపు—తపస్సులాగా సాగుతూ వుండేది. ఈ తపస్సులో నిమగ్నులైన వున్నవాళ్ళకు మరో ఆనందం వుండే అవకాశంలేదు.

మనస్తత్వరీత్యా నైతేనేం, దృక్పథాలలో నైతేనేం వాళ్లు మానవులకంటె కాడిమెద్దులకు సన్నిహితంగా వుండేవాళ్లు.

శ్రామికవర్గానికి చెందవలసిన ఆర్థిక పరిస్థితు లుండి కూడా బ్రాహ్మణ కుటుంబాలైన కారణంచేత మధ్యతరగతి హోదాతో నెట్టుకువచ్చినవారిని నేను చాలా మందిని చూశాను. కాని బ్రాహ్మలైన దోషంచేత మధ్యతరగతి అనిపించుకుంటూ శ్రామికులు పొందిన జీవితానందంకూడా సాధించలేక పోయిన కుటుంబం నా యెరుకలో సోమయాజులు వాళ్ళదే. రానురాను బ్రాహ్మణ కుటుంబాలకు యీ గతే హెచ్చుగా పడితే నే నాశ్చర్యపడను.

అప్పటికీ సోమయాజులు కుటుంబం మధ్యతరగతి సంస్కారానికి చాలావరకు వుద్వాసన చెప్పేశారు. వాళ్ళింట అక్కరలు వచ్చేవికావు. ఒకవేళ వస్తే యెవరికీ తెలిసేదికాదు. ఎవరన్నాపిలిస్తే వెళ్ళేవాళ్లు. కాని వాళ్లను ఎదురుపిలిచేవాళ్లు కారు. ప్రక్కవీధిలోవున్న చుట్టాలనే యేడాదికొకసారి చూసే వాళ్లుకారు. ఉన్నదరిద్రాన్ని చిన్నమసిపాతతోనన్నా కప్పటానికి యత్నించేవారుకారు.

* * * *

సోమయాజులు యేవిధంగా వాళ్ళ యింటో మిగతా వాళ్ళతో అతికినా నేను స్నేహం చెయ్యలేకపొయ్యేవాణ్ణి. లేక స్నేహం కారణంగా వాడు నాకు మరొక విధంగా కనిపించేవాడో! ఏమైనా నా కళ్ళకు సోమయాజులు దరిద్రం ఒక లోపంగా కనిపించేదికాదు. నాకు వాణ్ణిచూస్తే అవ్యాజంగా చెప్పరాని జాలికలిగేది. కాని ఆ జాలి బాల్యస్నేహ

లక్షణం. దానికి వాడి దారిద్ర్యంతోగాని, వాడి కష్టాలతో గాని సంబంధంలేదు. నిజంగా కష్టాలుచూసి జాలిపడేశక్తి అంత చిన్నవయసులో యెక్కడుంటుంది ?

స్కూలుఫైనల్ దాకా నేనూ సోమయాజులూ కలిసి చదివాం. కాని అంతటితో వాడు చదువు కట్టిపెట్టి వకీలు సత్యనారాయణగారి దగ్గిర ప్లీడరుగుమాస్తా పని నేర్చుకునే వాలంటీరుగా చేరాడు. ఆ తరువాత నేను నాలుగేళ్ళు కాలేజీ చదువు చదివి పైనా లోపలకూడా యెన్నో మార్పులకు లోనైనా, ఏ మూలో వాడికోసం నా హృదయంలో కొంత మేర మార్పులేకుండా దాచి వుంచాను. గడియారాల నెవరూ వెనక్కు తిప్పలేరుగాని కొంతవరకు నాటిని ఆపివుంచటం అసంభవంకాదు.

* * * *

సోమయాజుల్ని గురించిచెప్పవలసిన విషయం చెప్పలేదు. వాడు పాడగలడు. ఎవరంత బాగా పాడగలడని అడక్కండి. నిజంగా గొప్ప పాటకు సాటిలేదు. సంగీతంలో విద్వత్తును పోల్చవచ్చు సాధనను పోల్చవచ్చు. గొంతెత్తి మనస్సులు కరిగించే వాడి పాటలో ఆనందాన్ని యింకోదాంతో యెట్లా పోల్చటం ? సోమయాజులుకు రాగజ్ఞానం లేదు, స్వరజ్ఞానం లేదు, తాళజ్ఞానం లేదు. పాటలో తన్మయత్వం తీసుకురావ టానికి యీ మూడూ అవసరంలేదని నాకు సోమయాజులు ఋజువుచేశాడు. ఒక్క సాహిత్యంతో తప్ప తన్మయత్వంరాని నాకు వాడిపాట వైరాగ్యం తెచ్చింది. అది అహోరాత్రాలు నన్ను రకరకాల పీడించేది. వాడి పాట వినే ఆనందంతో సుఖమే

హెచ్చుగా వుండేదో, బాధే హెచ్చుగా వుండేదో నిర్ణయించలేకపోయేవాణ్ణి.

సోమయాజులు పాటనుగురించి నేను చెప్పేది అతిశయోక్తి కాదని ఋజువుచేయటానికి లేదు. కాని, ఒక్కమాట మాత్రం చెప్పగలను. వాడి పాట విని చలించనివాళ్ళను కూడా చూశాను. నాకన్నా వెర్రెత్తినవాళ్ళను కూడా చూశాను; జయలక్ష్మి ఒక పెద్ద తార్కాణం.

నాకు జయలక్ష్మిమీద యేవిధమైన అభిమానంగాని, గౌరవంగాని లేదు. కాని ఆ పిల్ల వాడివెంట ఎందుకుపడిందో నే నూహించగలను. నేను ఆడదాన్నయివుంటే సోమయాజులు పట్ల సరిగా జయలక్ష్మిలాగే ప్రవర్తించి వుండేవాణ్ణేమో.

జయలక్ష్మి మరెవరోకాదు. వకీలు సత్యనారాయణగారి చెల్లెలుకూతురు. వాళ్ళ నాన్న పట్నంలో గొప్ప వ్యాపారస్తుడు. ఆయనకు యేమీ లేదు. సత్యనారాయణగారి చెల్లెలు మల్లికాంబను ఆయన కిచ్చినప్పుడు సత్యనారాయణ తండ్రిగారిని అంతా కోప్పడ్డారు—దారేపొయ్యేవాడికి పిల్లనిచ్చారని. సత్యనారాయణగారు ప్రాక్టీసుపెట్టి రెండుచేతులా సంపాదన ప్రారంభించగానే అత్తవారిదృష్టిలో గురునాథంగారు మరీ చులకన అయినాడు. కాని, జయలక్ష్మి పుట్టడమే ఆరంభం, గురునాథంగారి దశ తిరిగి పట్టిందల్లా బంగారం కాసాగింది. చూస్తుండగానే ఒక లక్ష వెనకవేసి రెండో లక్షకు నడుం బిగించాడు. చిన్నచిన్న బస్తీల వాతావరణంలో వదిలిపోయిన మొక్క పట్టణం వాతావరణంలో పెరిగి

మహావృక్షమై వూడలు దించసాగింది. జయలక్ష్మి సంపన్నుల పిల్ల జయలక్ష్మి అన్న ఇంగ్లండులో చదివివచ్చి పెద్ద వుద్యోగంలో వున్నాడు.

జయలక్ష్మి మేనమామగారింట కొన్ని రోజులు వుండటానికి వచ్చింది. సోమయాజులు పాడతాడని ఆమె యెట్లా పసికట్టిందో తెలియదు. తన మేనమామ దగ్గిర గుమాస్తా కనకా, తను సంపన్నురాలూ-అతను బీదవాడు కనకా ఆమె మొదట తన అధికారం వినియోగించి అతనిచేత పాడించుకున్నది. తన మేనమామ యింటో లేనప్పుడు అతన్ని మేడ మీాది వరండాలోకి పిలిపించి పాడమనేది. సోమయాజులు పాడేవాడు.

నిజంగానే జయలక్ష్మికి మతిపోయింది, సోమయాజులు పాటతో. అతను పాడనంటే బాధపడేది. క్రమంగా అతని మీాద తనకుగల అధికారాన్ని మరిచిపోయింది.

"ఇదుగో, అమ్మాయ్! ఇక నన్ను పాడమనకు. ప్లీడరుగారు కోప్పడ్డారు. 'పాటశే పాడతావా, పనేచేస్తావా?' అన్నారు. నాకీ పాట కూడుపెడుతుందా, గుడ్డపెడుతుందా?" అన్నాడు సోమయాజులు ఒకరోజు జయలక్ష్మితో.

"పోనీ పాడకు—నీ కిష్టంలేకపోతే" అన్నది జయలక్ష్మి నిబ్బరంగా. కాని లోపల ఆమె మనస్సు దహించుకు పోతున్నది. నల్లమందు అలవాటైనవాడికి అది లేకుండావుండటం యెంత దుర్భరమో, సోమయాజులు పాటవినకుండా వుండటం ఆమెకంత దుర్భరమయింది.

ఒకరోజు సాయంకాలం సోమయాజులు కోర్టునుంచి ప్లీడరుగారింటికి వచ్చాడు పనుండి. ప్లీడరుగారు నేరుగా క్లబ్బుకు వెళ్ళారు.

ఆఫీసుగదిలో సోమయాజులు పని చూసుకుంటుండగా జయలక్ష్మి వచ్చి అతని యెదురుగా మాటా పలుకూ లేకుండా నిలబడింది. ఆమెలో యేదో మార్పు కనిపించింది సోమయాజులుకు వారంరోజులు వస్తున్నదానల్లే వున్నదామె.

"ఏమిటి?" అన్నాడు సోమయాజులు.

"నేను రేపు వెళ్ళిపోతున్నాను" అన్నది జయలక్ష్మి.

"అట్లాగా?" అన్నాడు.

"ఎంత అదృష్టం! నేను మళ్ళా కనిపించనని నీకు విచారం లేదుకద!" అన్నదామె.

దీని కేమనాలో సోమయాజులుకు తెలియలేదు.

"ఒక్కసారి పాడు! మళ్ళీ వినను" అన్నది జయలక్ష్మి.

"ఇప్పుడా? పనుంది" అన్నాడు సోమయాజులు.

జయలక్ష్మి భరించలేకపోయింది.

"పని! పని! ఏం పని యిది. గొప్పవాళ్ళ యిళ్ళల్లో కుక్కలు నీ కన్న బాగా బతుకుతై. ఇదేనా పని! మా మామ నెలకు పదిరూపాయ లిస్తాడా? ఈ పదిరూపాయల కేనా నీకు దేవుడింత పాట యిచ్చాడు? నీకు ఆశ లేదా? గొప్పవాడివౌదామని లేదా?" అని ఘాటుగా యెత్తిపొడిచింది జయలక్ష్మి.

"అందరూ గొప్పవాళ్ళయితే కొద్దివాళ్ళెవరు?" అన్నాడు సోమయాజులు.

"నువు కొద్దివాడివిగనే వుండు. కాని కాస్సేపు పాడు. నీ యిష్టం. ఏదన్నా రాగం ఆలాపన చెయ్యి నీకు పాటలు పాడటం చాతకాదు" అన్నది జయలక్ష్మి.

సోమయాజులు నవ్వి సన్నగా పాడసాగాడు. పైగా కేదారగౌళ ఆలాపన చేశాడు. వాడి శంకరాభరణంగాని, కల్యాణిగాని కొంతవరకు తట్టుకోవటం చాలా కష్టం

జయలక్ష్మికి నిజంగానే మతిపోయింది. వాడు పాడటం ఆవగానే "ఎట్లాపాడతా వింతపాట! ఎన్నోసార్లు నేను మోసపోయినా ననుకున్నాను. నువ్వు నిజంగా అంత బాగా పాడవని. నేనే వూహించుకుంటున్నాననీ అనుకున్నాను. నే నింకా యే డెభై ఏళ్ళో బతుకుతాను కాని నీ పాట వినలేను. నువ్వు నిజంగా యింత బాగా పాడలేదనీ, నా భ్రమ అనీ మళ్ళీ నన్ను నేను నమ్మించుకుంటున్నాను. ఎట్లా సోమయాజులూ ? రోజూ నీ పాట వినటం యెట్లా సోమయాజులూ ? రోజూ నీ పాట వినటం యెట్లా ? మీ యింటో వాళ్ళంతా యెంత అదృష్టవంతులు! రోజూ నీచేతపాడించుకు వింటారు కామాూ?" అన్నది.

"నాచేత బలవంతాన పాడించేవా డింకొక్కడే వున్నాడు" అన్నాడు వాడు.

"ఐతే నే నొక్కతెనే కాదన్నమాట ? నాకు మతిపోలేదన్నమాట ! ఈ అనుమానంకూడా నాకు తట్టిందిసుమా" అన్నది జయలక్ష్మి.

* * * *

సోమయాజుల్ని పెళ్ళాడాలనే బుద్ధి జయలక్ష్మికి యెప్పుడు పుట్టిందో నాకు స్పష్టంగా తెలీదు. సోమయాజులుకు ఆమె

పట్నంనుంచి ఒక వుత్తరం రాసింది. ఉత్తరంలో చాలా కవిత్వం వుంది. సోమయాజులు మనిషి యెదురుగావున్నా చలించనివాడు కాస్తా ఆ వుత్తరానికి చలించాడు. విశేష మేమంటే ఆ వుత్తరంలో జయలక్ష్మి తనను పెళ్లాడమని సోమ యాజులు నడిగింది. వాడు ఒప్పుకుంటే తన తండ్రిని ఒప్పిస్తా నన్నది. వెధవ ప్లీడరు గుమాస్తాగిరి మానేసి తన దగ్గిరే వుండవచ్చునన్నది.

వాళ్ళిద్దరిమధ్యా వుత్తరప్రత్యుత్తరాలు సాగినై. అన్ని వుత్తరాలూ వాడు నాకు చూపలేదు. ఆ విధంగా అందులో యేమున్నదీ నాకు తెలియజేశాడు.

ఒకటిమాత్రం ఖాయం. గురునాధంగారు కూతురు పెళ్ళి ఆలోచనకు వెంటనే ఒప్పుకోలేదు. కాని జయలక్ష్మి చాలా మొండిది. ఆఖరుకు సోమయాజులును వాళ్లు పట్నం పిలిపించారు. వాళ్ళే రైలుఖర్చులుకూడా యిచ్చారు. ఇంత దాకా వచ్చినాక సోమయాజులు తలిదండ్రులకు విషయం తెలిసిపోయింది. వాళ్ళ సంతోషానికి మేరలేదు. తమ కొడుకు పెళ్ళి అయినట్టుగా అందరితోనూ చెప్పేశారు.

వాడి తండ్రి నన్ను చాటుగా పిలిచి "చూడు బాబూ! మా వాడికి వాళ్ళు బాగా కట్నం యిచ్చేట్టు చూసుకోవద్దా మనం? ఇవ్వగలవాళ్ళేగా తీపురమా?" అన్నాడు.

"వీరిందులో జోక్యం కలిగించుకోకండి. అసలే దగ్గితే వూడే ముక్కుగా వుంది. ఈ పెళ్ళికి వాళ్ళెట్లాగూ ఒప్పుకోరు. ఒకవేళ ఒప్పుకుంటే అదే అన్ని కట్నాలూనూ.

మీా రిందులో తొందరపడి వేలుపెట్టారో అసలుకు మోసం వస్తుంది" అన్నాను.

"అదేమిటోయ్ ! మనం మగపెళ్ళివాళ్ళంగా ? మన పిల్లవాణ్ణి వాళ్లు పిలిపించటం యేంటి ? అన్నాడాయన.

"ఈ పెళ్ళి జరిగితే పెళ్ళివారంతా కలిసి మీాఅబ్బాయి ఒక్కడే. ఆ చేసుకునే అమ్మాయి ఒక్క మొగుణ్ణే చేసుకుంటుందిగాని అత్తగారినీ, మామగారినీ చేసుకోదు" అన్నాను.

"అదేం ? కాపరానికి రాదూ ?"

"మనవాడే కాపరానికి పోతాడు."

"ఛా !" అన్నాడు సోమయాజులుతండ్రి, నా మాట నమ్మలేకుండా.

గురునాథంగారూ వాళ్ళూ సోమయాజుల్ని గురించి యెంత తక్కువ అంచనాలు వేసుకున్నారో మనకు తెలీదు. అది సోమయాజులుకే లాభించింది.

"కుర్రాడు బాగానే వున్నాడే !" అన్నది జయలక్ష్మి తల్లి మల్లికాంబగారు. గురునాథంగారికి కూడా అదే తోచి వుండాలి.

అదీకాక సోమయాజులు అందరిపట్లా చాలా వినయ విధేయతలుగా వుండేవాడు. ఎవరితోనూ, ఏవిషయాలలోనూ పేచీలు పెట్టుకునేవాడు కాడు. అన్నిటికన్నా ముఖ్యం—— జయలక్ష్మిమీాద చాలా అపేక్షగా వుండేవాడు. వాణ్ణి బజారుకు తీసుకుపోయి జయలక్ష్మి వాడికి మంచి సూట్లురెండు ఆర్డరు చేయించింది, ధోవతులూ, షర్టులూ కొనిపెట్టింది.

గురునాధంగారి యింట్లో జయలక్ష్మికి యేమీటువంటి అడ్డూ లేదు. ఆమెకు వేరే గది వుంది. ఆ గదిలో యిద్దరూ గంటలతరబడి కూర్చునేవాళ్ళు సోమయాజులు చేత గంటల తరబడి పాడించుకునేది. వాణ్ణి ఆనుకొని కూర్చొనేది. మరీ ఆపేక్షవస్తే వొళ్ళోనే వచ్చి కూర్చునేది.

ఇంకా పెళ్ళికాకపూర్వమే సోమయాజులుకు పాడట మంటే అసహ్యం పుట్టిపోయింది. పాపం! జయలక్ష్మి తన తృష్ణ సంతృప్తి పరుచుకోవటంలో సోమయాజులుకు ఆవగింజంతైనా స్వాతంత్ర్యం లేకుండా చేసింది. తనంతట తాను గొంతెత్తి యెన్నో యుగాలైన ట్టనిపించింది వాడికి. ఈ సమయానికి వాడికి జయలక్ష్మిమీద ప్రేమే ప్రజ్వలించకపోతే యెవరి తోనూ చెప్పకుండా యింటికి వచ్చెయ్యవలసినవాడే.

వాడు పట్నం వెళ్ళిన నెలరోజుల్లో పెళ్ళి ఐపోయింది. పెళ్ళికి వాడి తల్లిదండ్రు లెవరూ వెళ్ళలేదు. "మీరు వెళ్ళ నవసరంలేదు" అని నేను చెప్పిన సలహా, డబ్బు ఖర్చవుతుం దన్న వాళ్ళ తాపత్రయానికి కలిసివచ్చింది.

*　　*　　*　　*

జయలక్ష్మి సోమయాజుల్ని తప్ప పెళ్ళాడనని ఎందుకు పట్టుపట్టిందీ ఆమె యింటివాళ్ళకుగాని, స్నేహితులకుగాని తెలియదు. పెళ్ళి అయినాకమాత్రం ఆమె "మా ఆయన సంగీతం మీరు వినలేదు కాదూ!" అని అందరిదగ్గిరా వాడి పాట వినిపించసాగింది.

తన మొగుడిపాట విన్నవాళ్ళంతా తన మాదిరిగానే వెర్రెత్తిపోతారనీ, యింత పాటగాణ్ణి మొగుణ్ణి చేసుకున్నం

దుకు వాళ్ళు తననుచూసి అసూయ పడతారనీ ఆమె ఆశించి వుంటుంది. ఈ విషయంలో ఆమెకు నిరాశ అయింది.

సోమయాజులు పాటవిన్న వాళ్ళలో చాలామందికి అందులో యేమంత ప్రత్యేకత కనిపించలేదు. కొందరు అతన్ని "ఆ రాగంపాడు, ఈ రాగంపాడు, ఆ కృతిపాడు, ఏవైనా సినిమాపాటలుపాడు, హిందీపాటలు పాడు" అని అడిగి ఆశాభంగం పొందారు. కాస్త సంగీతజ్ఞానం కలవాళ్ళు సోమయాజులు కా జ్ఞానం లేదని తెలుసుకున్నారు.

పైకి అందరూ యింపైనపాట! చక్కని శరీరం మంచి వాదుగు" అన్నారేగాని ఒకళ్ళూ జయలక్ష్మి లెక్కన తన్మయత్వం పొందలేదు.

పైగా సోమయాజులు తిరగబడ్డాడు. "నీకోసం పాడమంటే పాడతానుగాని వీళ్ళందరిముందూ పాడమంటావు దేనికి? వాళ్ళకు నా పాట నచ్చకపోవచ్చు. నువు జిడ్డు తగిలిస్తున్నావనుకోరా ?" అన్నాడు.

"పాట అన్న తరవాత నలుగురికీగాని ఒక్కరికా ?" అన్నది జయలక్ష్మి, తన కీర్తికాంక్షను అభ్యుదయ నినాదంతో సమర్థిస్తూ.

ఈ అంధకారంలో జయలక్ష్మికి ఒక ఆశారేఖ అగుపించింది. గురునాథంగారి స్నేహితులలో ఒక పాటగాడొకాయన వున్నాడు. ఆయనకూడా సోమయాజులుపాట విన్నాడు. తన అభిప్రాయాన్ని జయలక్ష్మి వింటుండగానే గురునాథంగారికి చెప్పాడు.

"మనవాడు పూర్వజన్మవాసనవల్ల మంచి గాత్రంతో పుట్టాడు కాని సరిగమల దగ్గర్నుంచీ కట్టుగా నేర్చుకుంటే గాని పాటగాడుగా రాణించలేడు" అన్నాడాయన.

"అట్లా ఐతే సంగీతం చెప్పిద్దాం" అన్నాడు గురునాధం.

సోమయాజులు గొప్ప పాటగాడు కావటానికి పాడే శక్తి కోల్పోవటానికి అదే మొదలు.

సోమయాజులుకు చాల పెద్ద విద్వాంసుణ్ణి చూసి పెట్టారు. సాధన ప్రారంభించాడు. ఇంటిదగ్గరకూడా తంబురా పెట్టుకుని సాధన చేసేవాడు. అదివరలో తన మొగుడు గొంతెత్తితే పరవశమయ్యే జయలక్ష్మి యీ సాధన బలవంతాన సహించవలసి వచ్చింది.

ఈ విధంగా సోమయాజులు మూడేళ్ళపాటు సంగీత శిక్షణ పొందాడు. రాగాల్లో భేదాలేమిటో, మేళకర్తలేమిటో, జన్యరాగాలేమిటో, ఆరోహణావరోహణ లేమిటో, తాళ భేదాలూ జాతులూ అన్నీ నేర్చుకుని కర్ణాటక సంగీత విద్వాంసుడైనాడు.

అదివరకు తాను పాడిన "గాలిపాట" తలుచుకుని వాడు సిగ్గుపడేవాడు. కాని ఇప్పుడు వాడి పాటచూసి పరవశమయ్యే వాళ్లు లేరు. సంగీత పాండిత్యంలో వాణ్ణి తలదన్నిన హేమా హేమీలు వుండనే వున్నారు. ఏ రోజున రేడియోవాను మద్రాసుకుగాని తిరుచినాపల్లికిగాని తిప్పినా సోమయాజులు జన్మలో సంపాదించలేని కీర్తిని సంపాదించుకున్నవాళ్లు విని పిస్తారు! సోమయాజులు ప్రత్యేకత యేమిటి?

ఇప్పుడు సోమయాజులు పాడితే జయలక్ష్మి గుండె తటతటలాడటంలేదు. ఆమె వాణ్ణిప్పుడు పాట పాడమని అడగదు. వాడు రాగం పాడితే గొంతెత్తగానే రక్తిగా వుండేది. ఇప్పుడు గంటా గంటన్నరా వింటేగాని అందులో ఏ రసమూ వుత్పత్తికాదు.

"ఏమోయ్ ! ఇంత కష్టపడి, ఇంత డబ్బు ఖర్చుచేసి నేర్చుకున్నావు సంగీతం. దీనివల్ల ఫలిత మేమిటోయ్ ?" అన్నాడు మామగారు.

"పాటకచేరీలు చేసుకోవచ్చు—ఎవరన్నా చేయిస్తే" అన్నాడు అల్లుడు సంకోచంతో.

చిత్రమేమిటంటే, సోమయాజులు సంగీతం నేర్చుకున్నందుకు సంతోషించినవాడు సోమయాజు లొక్కడే. పాపం, వాణ్ణి పాటకచేరీలు చెయ్యటాని కెవరూ పిలవలేదు.

వాడికి విద్వత్తు లేకపోవటం ఒక్కటే లోపమన్నట్టు వెనక మాట్లాడినవాళ్ళుకూడా విద్వత్తు సంపాదించి వాడు పరిపూర్ణుడైనాడని హర్షించలేదు.

జయలక్ష్మి రేడియో యెప్పుడన్నా పెడితే సినిమా రికార్డులు పెట్టుకు వినేది. కాని ఆమెకు సంగీతంమీద వెనకటి ఆసక్తిలేదు.

*   *   *   *

ఒకరోజు జయలక్ష్మిఅన్న వుద్యోగం మానేసి యింట్లో వుంటున్నరోజుల్లో, గురునాథంగారింటి కొకమనిషి వచ్చాడు. జయలక్ష్మి అన్న పరబ్రహ్మశాస్త్రి ఆయనతో యేదో వ్యవహారం మాట్లాడాడు. పరబ్రహ్మశాస్త్రి తన బావమరిదిని

పిలిచి ఆ పెద్దమనిషిదగ్గర పాడమన్నాడు. సోమయాజులు పాడాడు. ఆ తరువాత వాళ్ళు వాణ్ణి పంపించేశారు.

సోమయాజులు భార్య నడిగాడు.

"ఏవో నాటకాలు కంట్రాక్టు చేస్తారుట. మా అన్నయ్య చెప్పలా ?" అన్నది జయలక్ష్మి అట్టే ఆసక్తి లేనిదానల్లే.

"నన్నెందుకు పాడమన్నారు ?"

"ఏమన్నా వేషం వేయిస్తారేమో ? పాడగలరుగద ?" అన్నది జయలక్ష్మి.

ఆ మాట అక్షరాలా నిజమయింది.

ఈ సంఘటన జరిగిన నెలకల్లా పరబ్రహ్మశాస్త్రి పట్నంలో ఒకమూల యిల్లుతీసుకుని నటులను చేర్చి నాటకం రిహార్సల్స్ ఆరంభించాడు. ఆ పెద్దమనిషి—ఆయన పేరు శేషయ్య—పాటలు యెట్లా పాడాలో, ఎవరు యెట్లా నటించాలో చెబుతూ వచ్చాడు. సోమయాజులుకు చాలా పాటలు పద్యాలు గల పాత్ర యిచ్చారు.

"నీకేం బోలెడంత పాట వుంది. పాడేస్తే చాలు. నాటకం రక్తి కడుతుంది. నటించనక్కర్లేదు. కాస్తో కూస్తో నేను చెబుతాను. రెండునెల్లు రిహార్సల్స్ నలిగితే తరువాత అసలు అనుభవమంతా స్టేజీమీద వస్తుంది" అన్నాడు శేషయ్య.

"ఇంత కష్టపడి సంగీతం నేర్చుకుని నేను స్టేజీమీద పద్యాలుపాడటమేమిటి ?" అన్నాడు సోమయాజులు బావ మరిదితో.

"అదే పొరపాటు. కోటివిద్యలూ కూటికొరకే. చెరువులో నీళ్ళుండి యేం లాభం? వాటిని మనం ప్రయోగించుకోవాలి" అన్నాడు శాస్త్రి.

రిహార్సల్సులో శేషయ్య సోమయాజులుకు పద్యాలెట్లా పాడాలో, ఎక్కడనిలపాలో, ఎక్కడ రాగంతియ్యాలో పద్యం యెట్లా ఎత్తుకోవాలో, ఎట్లా ముగించాలో చెప్పాడు. శేషయ్యకు గొంతులేదు పాట రాదు, కాని పద్యం యెట్లా చదవాలో తెలుసు. పద్యం చదవటంలోకాక రాగాలాపన చెయ్యటంలో ఆసక్తి మెండుగ గల సోమయాజులుకు సంగీతం ఖూనీ అవుతున్నట్టు తోచింది శాస్త్రితో ఫిర్యాదుచేస్తే, శేషయ్య చెప్పినట్టు చెయ్యమన్నాడు.

రెండు నెల్లల్లో నాటకం పడింది. మొదటి ప్రదర్శనానికి అట్టే జనం రాలేదుగాని వచ్చినవాళ్లు సోమయాజులు పాటకు తన్మయులైనారు కొన్ని పద్యాలు మూడేసిసార్లు కూడా పాడించారు.

"ఆ వన్సుమోర్లు నాకు—నీకుకాదు" అన్నాడు శేషయ్య.

"నాకు తెలుసు" అన్నాడు సోమయాజులు నిగర్వంగా.

ఈ నాటకం మొత్తంమీద రెండువందల ప్రదర్శనాలు పడ్డాయి. శాస్త్రి శేషయ్యా కలిపి పాతికవేలు లాభంచేశారు. సోమయాజులుకు ఆంధ్రదేశంలో స్టేజీమీద పాడగలవాడనే పేరుమాత్రం లభించింది.

అతనికి నాటకాలలో ఆఫర్లుకూడా రాసాగినై. ఆటకు యాభై మొదలు నూరు రూపాయల చొప్పున యిస్తామని

అతని వెంట పడ్డారు నాటకాలవాళ్ళు. కాని వెళ్ళవద్దని శాస్త్రి అన్నాడు.

పరబ్రహ్మశాస్త్రి కింకా పెద్ద ఆలోచన లున్నాయి. అతను గ్రామఫోన్నూ, సినిమాపాటల రికార్డులూ కొన్నాడు. ముఖ్యంగా హిందూస్థానీ సినిమాల రికార్డులు.

"ఇదీ రేపటి సంగీతం. ఈ సంగీతంలో లక్షణాలున్నాయి. వీటిని బాగా పట్టుకోండి. ఈ బాణీ అలవాటైతే ఆ తరవాత యేం చెయ్యాలో చెబుతాను" అన్నాడు శాస్త్రి.

సోమయాజులు గొంతుకి పంజాబీ సంగీతం—ఒక రాగ లక్ష్యంగాని, ఒక శాస్త్ర నిబంధనగాని లేని యీ కలగా పులగపు సంగీతం—పచ్చివెలక్కాయ అయికూర్చుంది.

"ఇదేం సంగీతం? దీన్లో అర్థమేమిటి? దీన్ని నేర్చుకోవట మేమిటి? నా కిదెట్లా అబ్బుతుంది?" అని సోమయాజులు వాపోయినాడు.

"వినటానికి సుఖంగానే వుంటుంది. అందులో యేం లోపం వుంది?" అన్నది జయలక్ష్మి.

"అందులోవున్న సంగీత మేమిటి కనక?" అన్నాడు సోమయాజులు.

"అందులో యేమీ లేదని మీరే అంటారు. అది యెట్లా అబ్బుతుందనీ మీరే అంటారు; ఏది నిజం?" అన్నది జయలక్ష్మి సానుభూతి లేకుండా.

ఆకస్మికంగా సోమయాజులు సంగీతం విషయం ఆలోచించటం మానేసి జయలక్ష్మినిగురించి ఆలోచించసాగాడు. తన కోసం తనవాళ్ళందరితోనూ పోట్లాడి వెళ్ళొచ్చిన జయ

లక్ష్మి తనకు దగ్గరగా వుండికూడా యెంత దూరమయింది! ఎందు కిట్లా అయింది? తను యే మహాసముద్రంలో యే దిక్కుగా ప్రయాణిస్తున్నట్టు? ఈ ఓడ యే రేవు చేరుతుంది? తను కష్టపడి కర్నాటకం నేర్చుకున్నాడు. దాన్నివదలి నాటకం పద్యాల్లో పడ్డాడు. అవీ వొదిలేసి యిప్పుడు సినిమాపాటల్లో పడబోతున్నాడు! ఎవరికోసం? ఎవరు మెచ్చుకోవటానికి? తనకేపాటా రానప్పుడు తన పాట విని ఆనందించినవాళ్లున్నారు. ఇవ్వాళ?

ఈ ప్రశ్నలకు నిజంగా సమాధానాలు లేవు. ఉంటే సోమయాజులుకు తెలీవు.

వాడు ఏపనీ సగంచేసే బాపతు కాదు. ఒక సంవత్సరమల్లా సినిమా సంగీతంలో మునిగి తేలాడు. అందులో భావానికిగల ప్రాధాన్యం అర్థంచేసు కున్నాడు. వివిధ వాద్యాలు ఏ విధంగా వుపయోగిస్తారో ఊహించాడు. అందులో కొన్ని వాద్యాలు ఎట్లా వుంటాయోకూడా వాడికి తెలీదు. కాని వాటి ప్రత్యేకతలువాడి చెవిపట్టింది.

శాస్త్రి చాలా సాహసమైన ఎత్తువేశాడు. ఎవరో సినిమా చిత్రం తీస్తుంటే అందులో తాను రెండగాలవాటా తీసుకున్నాడు. తన ఎత్తేమిటో శాస్త్రి సోమయాజులుకు చెప్పేశాడు.

"నేను పది హేనువేలే పెడుతున్నాను. ఇది పోయినా నా కభ్యంతరంలేదు. కాని నేను ఈ పిక్చరుకు గట్టిమ్యూజిక్ డైరెక్టరును పెడుతున్నాను. నువ్వు అతని వెంటవుండి సినిమా

సంగీతం గురించి నేర్చుకోదగినదంతా నేర్చుకో. ఆ తరవాత ఏం చెయ్యాలో నేను చెబుతాను" అన్నాడు శాస్త్రి.

ఈ కొత్తచిత్రంలో పన్నెండు పాటలున్నాయి. ముందు పాటలే తయారుచేశారు. సంగీత దర్శకుడు ప్రసిద్ధుడూ, సమర్ధుడూనూ. పన్నెండు పాటలూ పూర్తిఅయి రికార్డు చెయ్యటానికి రెండు నెలలు పట్టింది. ఈ రెండు నెలలూ సోమయాజులు సమస్తవిషయాలూ చూశాడు. కొన్ని పాటలలో అక్కడక్కడా మార్పులుకూడా సూచించి సంగీత దర్శకుడిచేత బాగుందనిపించుకున్నాడు. చివర ఒకటి రెండు పాటలు తనే స్వయంగా రాశాడుకూడాను.

పాటలన్నీ రికార్డయినై. వాటిని విన్నవాళ్ళు చాలా మెచ్చుకున్నారు. అదొక గొప్పవిషయంకాదు. సోమయాజులు రాసిన రెండు పాటలను యెవరూ గుర్తించలేదు. మిగిలిన పాటలతో సమంగానే అవీ వున్నాయి. ఆ ఆధారంమీదే శాస్త్రి సినిమాకంపెనీ ఆరంభించాడు. వీళ్ళింకా చిత్రాలు తీయలేదు గాని తీస్తారు. వాటికి సోమయాజులు సంగీత దర్శకుడుగా వుంటాడు. అచ్చుగా సంగీతంమీదే హాయ్యే చిత్రాలుతీస్తారు. వాటిమీాద వచ్చేలాభం గురునాధంగారి మూడోలక్షలో చేరుతుంది. సోమయాజులు దేమీా వుండదు. నాలుగైదు చిత్రాలవరకూ సోమయాజులుకు ఢోకా వుండదు. ఆ తరువాత అతని పాటలు పాతబడసాగుతాయి. ఆ తరవాత సోమయాజులు తెలకపిండిరూపంలో గానుగలోంచి తోడబడతాడు. గురునాధంగారి వ్యాపారరధం చెక్కుచెదరకుండా ముందుకు సాగిపోతుంది.

ఎక్కడో అనామకుడుగా పడివున్నవాణ్ణి తెచ్చి యింత వాణ్ణిచేసిన కీర్తి ఏవిధంగానైతే గురునాథంగారికి దక్కిందో, ఆ విధంగానే సోమయాజులులో సంగీతం—డబ్బుచేసే సంగీతం—ఇంకిపోయిన మర్నాటినుంచీ వాణ్ణి బతికున్నంతకాలమూ పోషించే భారంకూడా గురునాథంగారికే దక్కుతుంది. అందుకుగాను సోమయాజులు యావజ్జీవమూ వారికి కృతజ్ఞుడై వుండగలడు.

పంచాయతీ
పన గ్రంథాలయం,
పోలు :: కృష్ణా జిల్లా.

సినిమా కథ

కథానాయిక పాడుతూ ఫేడిన్ అయి, క్లోజప్‌లో పాడుతూ మనకేసిచూచి నవ్వుతూ గదంతా డాన్స్ చేస్తున్నది. "ఎంత హాయి! ఎంత హాయి!" అనే పల్లవినిబట్టి ఆమెకు హాయిగావున్నట్టూ, అందుకే డాన్సు చేస్తున్నట్టూ మనకు తెలుస్తున్నది.

ఇంతలో కాఫీ పట్టుకుని కూతురిపాటకు లయగా అడుగులు వేస్తూ వచ్చి, పాటా బాజాభజంత్రీలూ ఆగిపోయిన దాకా నిలబడి కూతురికి కాఫీ అందిస్తూ, "ఎటువంటివాడు రావలిసున్నాడో!" అన్నది తల్లి.

కథానాయిక ప్రణయకోపం మొహాంపెట్టి, "పోమ్మా!" అన్నది.

"ఏమే? మంచి డాక్టరు మొగుడై. యిద్దరూ ప్రాక్టీసు పెడితే యెంత బాగుంటుంది?" అన్నది తల్లి.